ఆర్ ఎస్ ఎస్ x భారతదేశం

# ఆర్ ఎస్ ఎస్ సైద్ధాంతిక కపటత్వం


రచన

**విప్లవ్ మేష్ రామ్**
**శుభ, సుభాషిణీ అలీ,**
**డా. హేమలత, అర్చనాప్రసాద్**

అనువాదం

**కె.ఎల్. ప్రసాదరావు**
**కె.ఉషారాణి**



## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

TITLE : Ideological Blinkers of the RSS

ప్రథమ ముద్రణ : మే, 2016

వెల : ₹.15/-

ప్రతులకు

PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-64, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ -520 002, ఫోన్ : 0866 - 2577533.

బ్రాంచీలు

విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు,

ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

psbhap@gmail.com

121258

## విషయసూచిక


▲ ప్రవేశిక

**బృందాకరత్** **5**

▲ ఆర్ ఎస్ ఎస్ – వర్ణ/కుల వ్యవస్థ

**విప్లవ్ మేష్ రామ్** **9**

▲ ఆర్ ఎస్ ఎస్ ప్రాపంచిక దృక్పథంలో మహిళలు

**శుభ, సుభాషిణీ అలీ, డా. హేమలత** **22**

▲ ఆదివాసీలు – హిందూత్వం

**అర్చనాప్రసాద్** **29**

# ప్రవేశిక

భారతదేశ వ్యతిరేకి ఆరెస్సెస్ అన్న శీర్షికన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆరు లఘు గ్రంథాలను ప్రచురించింది.

ప్రముఖ మేధావులు, రాజకీయ నాయకులు తదితరుల రచనలతో యీ లఘు గ్రంథాలు కూడి వున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించిన నాటినుండి నేటి వరకు అది నిర్వహించిన, నిర్వహిస్తున్న తిరోగమన, విచ్ఛిన్నకర పాత్రను యీ లఘు గ్రంథాలు సాకల్యంగా వివరిస్తున్నాయి.

ఇవి: 1) ఖాకీనిక్కర్లు కాషాయధ్వజాలు 2) ఆర్.ఎస్.ఎస్. సైద్ధాంతిక కపటత్వం 3) గొడ్డు మాంస రాజకీయం మత విద్వేష వ్యూహం 4) ఆర్.ఎస్.ఎస్, బిజెపి ఆధ్వర్యంలో నయా ఉదారవాద విధానాలు 5) చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలపై బిజెపి దాడి 6) రాజ్యాంగ దినం, అసహనాలపై పార్లమెంటులో చర్చ అన్న అంశాలపై 2015 నవంబరులో పార్లమెంటులో చర్చ సందర్భంగా రాజ్యసభ, లోకసభల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మహమ్మద్ సలీంలు చేసిన ప్రసంగాలు.

ఈ లఘు పుస్తకాలలోని వ్యాసాలలో వుదహరించిన అనేక వుటంకింపులు ప్రధానంగా ఆరెస్సెస్ స్థాపకులు, ప్రత్యేకించి రెండవ సర్‌సంఘ్‌ఛాలక్ అయిన ఎం.ఎస్. గోల్వాల్కర్ రచనల నుండి యిచ్చినవేనన్న విషయాన్ని గుర్తుంచు కోవాలి. ఆరెస్సెస్ చేపట్టే సమకాలీన కార్యకలాపాలకూ ఆ రచనలకు సంబంధమేమిటని

ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఈ రచనలే యిప్పటికీ ఆరెస్సెస్ భావజాలానికి ఆకరంగానూ, దాని ప్రాపంచిక దృక్పథాన్నీ, కార్యాచరణనూ నిర్ధేశించేవిగానూ వున్నాయి. మనము లేదా మన జాతీయతా నిర్వచనము, పాంచజన్యం అన్న గ్రంథాలను గోల్వాల్కర్ రచించి ముప్పాతిక సంవత్సరాల కాలం గడచి వుండవచ్చు. అయినప్పటికీ హిందువుల కోసమే హిందూస్థాన్ అంటూ ప్రస్తుత ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌తో సహా ఆయనకు ముందున్న ఆరెస్సెస్ అధినేతలు చేసిన విషపూరిత వ్యాఖ్యలన్నీ వీటి ఆధారంగానే పుట్టుకు వచ్చాయి. గడచిన యీ అన్ని సంవత్సరాలలో ఆరెస్సెస్‌గానీ, లేదా, దాని రాజకీయ అవతారమైన బిజెపీగానీ ఆరెస్సెస్ స్థాపకులు రూపుదిద్దిన యే ఒక్క సూత్రాన్నయినా తిరస్కరించే సంగతి అలావుంచితే కనీసం వాటినుంచి విడగొట్టుకున్నట్లు చూపించే ఒక్క ప్రకటనగానీ, ప్రచురణగానీ లేనేలేదు. తద్విరుద్ధంగా ప్రస్తుత ప్రధాన మంత్రి తన పుస్తకంలో గోల్వాల్కర్ జీవితాన్ని గురించి రాస్తూ ఆయనను 'కాంతి పుంజం' అనీ, తనకు స్ఫూర్తినిచ్చిన వారిలో ఒకరనీ పేర్కొన్నారు. కనుక యీ లఘు గ్రంథాలలో వుదహరించిన వుటంకింపులు ఆరెస్సెస్ భావజాలాన్ని వివరిస్తాయి. కొన్ని పునరుల్లేఖనాలు వుంటాయి, ఇవన్నీకూడా విదేశీ ఫాసిస్టులైన హిట్లర్ నాజీల నుంచీ, ముసోలినీ బ్లాక్‌షర్ట్‌ల నుంచీ స్ఫూర్తి పొందినవే, ఆరెస్సెస్ 'మౌలికతను'అవగాహన చేసుకోవటానికివి వుపయోగ పడతాయి.

ఆరెస్సెస్ గతాన్ని తవ్వితీయవలసిన అవసరమున్నదా, అనుద్దేశంగానైనా వాటి ప్రాధాన్యాన్ని యివి హెచ్చించటం లేదా అన్న ప్రశ్నలు తలయెత్తవచ్చు. ఈ లఘు గ్రంథాలలోని పలు వ్యాసాలు తెలియ చెప్తున్నట్లుగా 'అన్యులకు' వ్యతిరేకంగా హింసను ప్రేరేపించేటందుకై ఆరెస్సెస్ అతి హేయమైన పద్ధతులను అనుసరిస్తున్నది. ఇందుకుగాను మత భావనలను వుపయోగించు కోవాలని, అదేవిధంగా యీనాటికీ మన ప్రజలలోని అట్టడుగు తరగతుల వారిని ప్రభావితం చేస్తున్న సామాజిక అసమానతల, లింగ తారతమ్యాల ప్రాతిపదికను కలిగివున్న సంప్రదాయాలను, విశ్వాసాలను వినియోగించు కోవాలని ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ బోధించే హిందూత్వ అనేది వి.డి. సావర్కార్ రూపుదిద్దిన రాజకీయ భావన మాత్రమే. సాధారణ హిందూ విశ్వాసులకిది చాలాదూరం. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని

వినియోగించు కోవటాన్ని వ్యతిరేకించి పోరాడేవారు తమ పోరాటం యొక్క లోతుపాతులు తెలుసు కోవలసిన అవసరం ఎంతైనా వున్నది.

వేర్వేరు మత విశ్వాసాలకు చెందిన విభిన్న ఛాందసవాద శక్తులు మతాన్ని రాజకీయాల కోసం వుపయోగ పెట్టుకుంటున్నాయి. ముస్లిం మత ఛాందసవాదులు అంతకంతకూ ముస్లిం యువజనుల్లోకి చొచ్చుకు పోవటం తీవ్రమైన ఆందోళన కల్గిస్తున్నది. ఈ శక్తులను ఏకాకులను చేసి వెనక్కు కొట్టవలసి వుంది.

జాతికి ప్రాతినిధ్యం వహిస్తున్నామంటూ తప్పుడు రీతిలో చెప్పుకునే మెజారిటీ హిందూ ఛాందసవాదులు నుంచి ముస్లిం ఛాందసవాదులు ప్రోత్సాహాన్ని పొందుతున్నారు. పరస్పర విరుద్ధ శక్తులుగా కనిపించే వీరు ఒకర్నొకరు బలపరచుకుంటూ మౌలిక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలిస్తున్నారు.

నరేంద్రమోడీ నేతృత్వాన బిజెపీ ప్రభుత్వం కేంద్రంలో తిష్టవేయడంతో, గతంలో అటల్ బిహారీ వాజపేయి హయాంలోవలె అధికార యంత్రాంగానికి ఆరెస్సెస్ దగ్గర కావటమేకాక, వాస్తవంలో ప్రభుత్వాన్ని అదుపుచేసే స్థాయికి చేరింది. మంత్రుల పనితీరు గురించి ఆరెస్సెస్ నాయకులకు నివేదికలను సమర్పించినపుడే అసలైన నాయకులెవరో స్పష్టమైంది. కనుక ఆరెస్సెస్ నిజస్వరూపాన్నీ, ప్రభుత్వంతో దానికున్న సంబంధాలనూ, యీనాడు రాజ్యాంగేతర శక్తిగా అది అధికారాన్ని చెలాయించటం గురించి బహిర్గతం చేయవలసి వుంది.

అంతేకాక నిజానికి నరేంద్ర మోడీ ఒక ప్రచారక్, అంటే, ఆరెస్సెస్ భావజాలానికీ, దాని సిద్ధాంతాలకూ, కార్యచరణకూ కట్టుబడిన పూర్తికాలపు కార్యకర్త. ఒక ప్రచారక్, భారత ప్రధాన మంత్రిగా మారటం ఆరెస్సెస్ పథకంలో పెద్ద ముందడుగు. గుజరాత్–2002, ఆయన నేతృత్వంలో సాగిన హిందూరాష్ట్ర పథకం యొక్క ఫలితం, ఒక ప్రయోగం. దీనికి ఆరెస్సెస్ పూర్తి మద్దతు వున్నది. 2014 లోకసభ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించి పెట్టేదెవరన్న విషయమై 2013–2014లో బిజెపీలో విభేదాలు తలెత్తినపుడు మోడీ అభ్యర్థిత్వానికి ఆరెస్సెస్ వెన్నుదన్నుగా నిలవటమే కాక ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ఎల్.కె. అద్వానీ తదితర సీనియర్ నాయకుల వ్యతిరేకతను రెచ్చకొట్టింది. ఒకప్పుడు ఆరెస్సెస్‌లో తనకు సహచరులూ, యీనాడు బిజెపీ ప్రభుత్వంలో వున్నవారు పదేపదే మతవుద్రికత్తలను

రెచ్చగొట్టే చర్యలకూ, ప్రకటనలకూ పాల్పడుతున్నప్పటికీ వారిపై చర్య తీసుకోవటానికి ప్రధాన మంత్రి నిరాకరణ ఆరెస్సెస్‌పట్ల ఆయనకున్న విధేయతను తెలియచెప్తున్నది. భారతదేశపు ప్రధానమంత్రి ముందుగా ఆరెస్సెస్ కార్యకర్త.

కనుక ఆరెస్సెస్ దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నదో దానికి సంబంధించిన వాస్తవాలు, కార్యకలాపాలు, విశ్లేషణా అందచేయ వలసిన అవసరం వున్నది. లౌకికవాద, ప్రజాస్వామ్య, సమానత్వ సూత్రాలను పరిరక్షించి పటిష్టం చేసేందుకై జరిగే పోరాటంలో యీ లఘు పుస్తకాలు వుపయోగ పడగలవనే మేము ఆశిస్తున్నాము.

ఈ వ్యాసాలను రచించి యిచ్చిన వారికీ, వీటిని వెలికి తీసుకువచ్చేందుకు తోడ్పడిన కామ్రేడ్స్‌కు, పార్టీ మిత్రులకు కేంద్ర ప్రచురణల తరపున మేము కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. వీటి నిమిత్తం వుపయోగించు కోవడానికి అనుమతి యిచ్చిన కార్టూనిస్టులకు కూడా మేము ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము.

**బృందాకరత్**

పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

# ఆర్ ఎస్ ఎస్ - వర్ణ/కుల వ్యవస్థ

**విప్లవ్ మేష్ రామ్**

సామాజిక న్యాయంపై ఇంతకాలం దాచుకుంటూ వస్తున్న ఆర్ ఎస్ ఎస్ విధానాన్ని బయట పెడుతూ, ఆర్ ఎస్ ఎస్ అధినేత మోహన్ భగత్ రిజర్వేషన్ విధానాన్ని మార్చాలంటూ తమ అధికార పత్రిక "ఆర్గనైజర్" లో ఈ మధ్య పిలుపునిచ్చారు. వాస్తవానికి భారత సమాజంలో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించే విధానానికి ఆర్ ఎస్ ఎస్ వ్యతిరేకంగా వుంది. కాని ఈ విధానాన్ని బహిరంగంగా వ్యతిరేకించటం అంత సులువైనది కాదు. గుజరాత్ లో హార్దిక్ పటేల్ 'శక్తివంతమైన పటేల్ తెగకు రిజర్వేషన్ల నన్నా కల్పించాలి. లేదా రిజర్వేషన్ విధానాన్ని రద్దు చేయాలి' అనే పిలుపు తో ముందు కొచ్చిన తర్వాతే ఆర్ ఎస్ ఎస్ అధినేతకు రిజర్వేషన్ విధానంపై తమ అసలు భావాల్ని బయట పెట్టకలిగే ధైర్యం వచ్చింది.

కులవ్యవస్థ కారణంగా భారత సమాజంలోని బలహీన వర్గాలు శతాబ్దాలుగా మానవ హోదాకి సైతం నోచుకోలేక పోయారు. వీరి ఉపాధి కల్పనలో రిజర్వేషన్ విధానానికి తగిన ప్రాధాన్యత వుంది. దేశంలోని అనేక ప్రాంతాలలో దళితుల పట్ల ఘోరమైన సామాజిక వివక్షత ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. మే 2013లో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ప్రచురితమైన" సమానావకాశాల

పై కుల వివక్షత, విశిష్టతల ప్రభావం – గుజరాత్ లో ఒక అధ్యయనం" అన్న ప్రభుత్వ నివేదికలో "కుల వివక్షత కేవలం దృక్పధాల అంశ" మేనని పేర్కొనబడింది. ఇది ఒక ఆర్ ఎస్ ఎస్ ప్రచారక్ యొక్క నిజమైన ఆలోచనాసరళిని తెలియజేస్తుంది. భారత జనాభాలో దళితులు 6వవంతులలో ఒక భాగమేనని, వారిలో అత్యధిక భాగం సామాజిక నిచ్చెనలో అట్టడుగున నివసిస్తున్నారని, దైనందిన జీవితంలో వారు తీవ్ర వివక్షతకు, వివిధ రకాల హింసలకు గురౌతున్నారని మనందరికీ తెలుసు. దీన్ని మనం కేవలం దృక్పధాల సమస్యగానే చూడ కలుగుతామా? రిజర్వేషన్లు వున్నప్పటికీ దళితులు అధమమైన ఉద్యోగాల్ని చేయాల్సి వస్తుంటే అగ్ర వర్ణాలు వున్నత స్థానాల్లో కొలువు తీరుతున్నారు. భూమిలేని పేదలలో అత్యధికులు దళితులే. గ్రామీణ ప్రాంతాలలో అగ్ర వర్ణ కుటుంబాల సగటు ఆదాయం కంటే దళిత కుటుంబాల సగటు ఆదాయం 40శాతం తక్కువగా వుందని, ఇటీవల విడుదలైన ఒక సర్వే పేర్కొంది. పట్టణ ప్రాంతాలలో ఈ తేడా 60శాతం దాకా వుంది. దళిత కుటుంబాలపై హత్యలు, చిత్రహింసలు, గృహదహనాలు, మానభంగాల లాంటి అఘాయిత్యాలు నిత్యకృత్య మయ్యాయి. కాని ఈ దుర్మార్గాన్ని ఆర్ ఎస్ ఎస్ ఖాతరు చేయకుండా హిందూ సమాజాన్ని వాస్తవంగా ఐక్యం చేయగల శక్తి, స్వచ్ఛమైన ప్రాచీన కులవ్యవస్థకే వుందని వాదిస్తున్నది.

వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థల నుండి వేరుపడలేని "హిందుత్వ" భావనే ఆర్ ఎస్ ఎస్ యొక్క సిద్ధాంతం. కుల దొంతరలు నిర్ధేశించిన విధుల్ని ప్రతివారు మారు చెప్పకుండా నిర్వర్తించాలని ప్రభోదించే కుల వ్యవస్థను ఆర్ ఎస్ ఎస్ నమ్ముతుంది. దళితులు, ఆదివాసీలపై ఆర్ ఎస్ ఎస్ కు ప్రేమేమీ లేదు. తాము ఆదర్శంగా భావిస్తున్న హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారమే దళితులు, వెనుకబడిన కులాల ప్రజలు తమ విధుల్ని నిర్వర్తించాలని ఆర్ ఎస్ ఎస్ కోరుతుంది. చేత్తో పని చేసే దళిత పాకివారు తాము చేసే వృత్తిని "ఆధ్యాత్మికానందం" గా భావిస్తున్నారని నరేంద్ర మోడీయే చెప్తున్నారు.

నరేంద్ర మోడీ వివిధ సందర్భాలలో ఐఎస్ అధికారుల నుద్దేశించి చేసిన ప్రసంగాలను 2007లో గుజరాత్ బిజెపి ప్రభుత్వం 'కర్మయోగ్' పేరుతో ఒక పుస్తకాన్ని

ప్రచురించింది. దాన్లో పాకివారి వృత్తిని గూర్చి మోడీ ఏమనుకుంటున్నారో చూడండి. "వాళ్ళు ఈ వృత్తిని వాళ్ళ జీవనాధారం కోసం చేస్తున్నారంటే నేను నమ్మను. అదే నిజమైతే వారీ వృత్తిని తరతరాలుగా కొనసాగించే వారుకాదు. ఈ వృత్తిని మొత్తం సమాజం యొక్క ఆనందంకోసం, దేవుళ్ళు ఆనందం కోసం చెయ్యాలని ఈ వృత్తిని నిర్వర్తించాల్సిన బాధ్యతను దేవుళ్ళు వారిపై వుంచారని, పారిశుధ్యం చేసి ఈ విధిని వాళ్ళ అంతరంగిక ఆధ్యాత్మిక కార్యకలాపంగా శతాబ్ధాలుగా కొనసాగించాలని, ఏదొఒక సందర్భంలో ఎవరో ఒకరు వాళ్లకు హితబోధ చేసివుండాలి. ఇది తరతరాలుగా కొనసాగుతుండాలి. ఈ వృత్తి/ఉపాధిని నిర్వర్తించటానికి మించి మరో ప్రత్యామ్నాయం వారి పూర్వీకులకు లేదని నేను నమ్మను"

**(48-49 పేజీలు . కర్మయోగ్ నరేంద్రమోడీ)**

ఇద్దరు దళిత పసికందుల్ని సజీవంగా తగులపెట్టి, భయభ్రాంతుల్ని చేసిన సన్‌పద్ సంఘటనను క్యాబినెట్ మంత్రి వి.కె.సింగ్ ఒక కుక్క చావుతో పోల్చాడు. అందువల్ల దళితుల గూర్చి ఆర్.ఎస్.ఎస్ యొక్క అసలు అభిప్రాయమేమిటి? దాన్ని వారెట్లా ఏర్పరచు కున్నారు. దీన్ని అర్థం చేసికోవటానికి వర్ణ/కుల వ్యవస్థను గూర్చిన సంక్షిప్త చరిత్రను తెలిసికోవలసిన అవసరం ఎంతైనా వుంది. ఎందుకంటే ఆర్ ఎస్ ఎస్, దాని వివిధ భాగాలు నిర్విరామంగా చరిత్రను తిరిగి వ్రాయాలని ప్రయత్నిస్తున్నాయి. మొగల్ పాలకులు కులవ్యవస్థను ప్రవేశ పెట్టారని, అంతకు పూర్వం అందరూ సామరస్యంగా సమానత్వంతో వున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మేము క్రింది చెప్పిన విషయాలలో సత్య దూరమైన అంశాలు ఏమి లేవు. ప్రాచీన హిందూ ధర్మశాస్త్రాలన్నీ వర్ణ వ్యవస్థను సంపూర్ణంగా ప్రశంసిస్తూ, తక్కువ కులాల వారిని మానవులకంటే హీనమైన నీచ స్థాయి జీవులుగా అమానుషంగా వర్ణించాయి.

## వర్ణ / కుల వ్యవస్థ - ధర్మశాస్త్రాలు

నాలుగు వర్ణాల వ్యవస్థ (చాతుర్వర్ణ్య వ్యవస్థ) పుట్టుకతో వచ్చే విధుల ఆధారంగా ఏర్పడినది. కుల వ్యవస్థను జతి వ్యవస్థ అని అంటారు. జతి అంటే పుట్టుక అని అర్థం. అందువల్ల కుల వ్యవస్థ వాస్తవంగా పుట్టుకపై ఆధారపడ్డ

వ్యవస్థ. కులవ్యవస్థ హిందూ సమాజంలో తప్ప మానవ చరిత్రలో మరెక్కడా లేదు. అధిక కులస్తులు నిమ్న కులస్తులు అనే తేడాలు కలిగిన దొంతరలు గా వుండటం ఈ కులవ్యవస్థ ప్రత్యేక లక్షణం. ఈ దొంతరల ప్రాతిపదిక ఎంత దృఢమైన దంటే, ఈ కులాల్లోని ఉప కులాల్లో కూడా అధికులమని, అధములని కొట్లాడుకుంటుంటారు.

ఈ నాలుగు వర్ణాలే కాకుండా, వర్ణ వ్యవస్థకు ఆవల విస్తారమైన ప్రజానీకం వున్నారు. వాళ్ళను సామాజిక వ్యవస్థలో అంతర్భాగంగా ఏ న్యాయం, చట్టం, ధర్మ శాస్త్రం పరిగణించలేదు. వారిది అధమజన్మ లేక అంత్యజ దళితులు, ఆదివాసులు అంత్యజులు, వారు కుల వ్యవస్థ వెలుపలి వారు. అందువల్ల సైద్ధాంతికంగా వారు హిందూ సమాజంలో సభ్యులు కారు. అందువల్లే దళితులను కుల భ్రష్టులు అని అంటారు.

వర్ణ వ్యవస్థ ఋగ్వేదం లోని పురుషసూక్తం నుండి పరిణామం చెందిందని భావిస్తున్నారు. ఋగ్వేదం నాలుగు వేదాల్లో పురాతనమైనది. క్రీస్తు పూర్వం 1500లో పరిణామం చెంది, అది పూర్తి కావటానికి శతాబ్దాలు పట్టింది. ఋగ్వేదం లో చివరిది పదవ మండలం. దీన్ని క్రీ.పూ. 800 సంత్సరంలో సృష్టించారని భావిస్తున్నారు. ఋగ్వేదాన్ని మొత్తం పరిశీలిస్తే, ఈ పదవ మండలంలో ఒకే ఒక్కసారి నాలుగు వర్ణాల ప్రస్తావన వుంది.

ఋగ్వేదంలోని పురుష సూక్తంలోని శ్లోకం ఇలా చెప్తుంది. "బ్రాహ్మణోస్య ముఖమసిద్‌చ బాహు రాజస్య: కృతా: ఉరు తదాస్య యద్ వైశ్య: పద్భ్యాం శూద్రో ఆజయత్" (వివరణః పురుషుడిని యజ్ఞంలో ఆహుతి చేసినప్పుడు ఆహుతి అయిన పురుష భాగాలను ఏమని నిర్వచిస్తారని అని పూజారి ప్రశ్నించినప్పుడు చెప్పిన సమాధానం," శిరస్సును బ్రాహ్మణునిగాను, భుజాలను క్షత్రియుని గాను, తొడల్ని వైశ్యులుగాను, పాదాలను శూద్రులు గాను పిలుస్తారు")

ఆర్యులు గంగానదీ మైదానం లో స్థిర పడిన తర్వాత, ఈ పదవ మండలం చేర్చ బడింది. ఆర్యులు సంచార జీవనాన్ని వదిలేశారు. వ్యవసాయం వారికి ప్రధాన వృత్తి అయింది. సంచార జీవనం లో ప్రధాన వృత్తిగా వున్న పశుపోషణ సహాయవృత్తిగా మారింది. స్థిరమైన వ్యవసాయం మరియు ఇనుప పరికరాల

వినియోగంతో అదనపు విలువ ఉత్పత్తి కావటం మొదలై, ఆర్యుల సమాజం వర్గాలుగా విడిపోవటం ప్రారంభమైంది. వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ పునాదిగా, వర్గ విభజనకు వీలుకల్పించేందుకు పురుష సూక్తం సృష్టించబడింది. పురుషసూక్తం నుండి కులవ్యవస్థ ఉద్భవించటం గుఱ్ఱం ముందు బండిని పెట్టినట్లుండి, అశాస్త్రీయంగా వుంది. వాస్తవంగా సమాజాన్ని వర్గాలుగా విడగొట్టిన తర్వాతే పురుష సూక్తం ఆ వ్యవస్థను దైవవ్యవస్థగా సమర్థించింది.

ఉత్పత్తి దారులు కనీస జీవనాన్ని, దోపిడీ వర్గాలు అత్యధిక లాభాల్ని పొందగలిగే సమాజ మనుగడకు వీలు కల్పిస్తూ, భౌతిక ఉత్పాదనకు కారకులైన ఉత్పత్తిదారులను రాజ్యాధికారం తన అదుపులో వుంచుకుంటుంది. నాలుగు వర్ణాలను రెండు గ్రూపులుగా విభజించినప్పటికి ద్విజులు(రెండు జన్మలు కలవారు తల్లి గర్భం నుండి పుట్టినప్పుడు మొదటి జన్మ, బ్రహ్మ జ్ఞానం పొందటానికి ఉపనయనం చేసికున్నప్పుడు రెండవ జన్మ) అల్ప సంఖ్యాకులు గాను, శూద్రులు అధిక సంఖ్యాకులుగా వుండేవారు. శూద్రులు ఉత్పత్తిలో పాల్గొనేవారు. ద్విజులలో అత్యధికులు పరాన్న భుక్తులుగా వుండేవారు. వీరు పౌరోహిత్యం, పరిపాలన, వాణిజ్యం లాంటి స్థానాలలో వర్ణాశ్రమ నిచ్చెన నిర్దేశించిన దొంతరలో జీవితం గడిపేవారు. వాళ్లందరూ ఉత్పత్తిదారులుగా వున్న శూద్రుల కష్టార్జితం పైనే జీవించేవారు.

శ్రమ జీవుల్ని దోచుకోవటంతో పాటు, వర్గాలుగా విడివడిన సమాజ నిర్వహణ నల్లేరు మీద బండిలా సాగిపోవటానికి, దోపిడికి గురౌతున్న వర్గాల్ని సైద్ధాంతికంగా వశపరచుకోవటం అవసరమయింది. దానికోసం వాళ్ళు తాము జీవిస్తున్న వ్యవస్థ దైవ వ్యవస్థ అని నమ్మించేందుకు పురుష సూక్తాన్ని వినియోగించుకున్నారు. ఆనాటి న్యాయ శాస్త్రాలుగా వ్యవహరింపబడుతున్న ధర్మ శాస్త్రాలు బ్రాహ్మణులు బ్రహ్మ ముఖం నుండి ఆవిర్భవించారని--- వగైరాలు వివరించాయి. బ్రహ్మ పాదాల నుండి పుట్టినందువల్ల మిగిలిన మూడు వర్ణాల ప్రజల భారాల్ని మోయటం శూద్రుల విధి అయింది.

ధర్మాన్ని ఆచరించాల్సిన పద్ధతుల్ని స్మృతులు వివరించాయి. అందులో దుర్మార్గమైంది మనుస్మృతి (మనుధర్మ శాస్త్రం) అది శూద్రులకు అమానుషమైన

అనేక చట్టాల్ని రూపొందించింది. ఉదాహరణకు శూద్రులే మూడు అగ్రవర్ణాల ఆస్థి కనుక, వాళ్లకు (శూద్రులకు) ఆస్థులు ఉండకూడదు; శూద్రుడు బ్రాహ్మణుని తిడితే అతని నాలుకను కోసివేయాలి, అదే ఒక బ్రాహ్మణుని శూద్రుడు తిడితే నామమాత్ర శిక్షవుంటుంది. శూద్రుడు బ్రాహ్మణుని కొడితే అతని భుజాల్ని నరకాలి. శూద్రుడు వేదం వింటే, కరిగించిన సీసాన్ని అతని చెవిలో పోయాలి, అతను వేదాన్ని చదివితే అతని నాలుకను కోయాలి. శూద్రుడు ఒక వివాదానికో, సంఘటనకో సాక్షిగా వుంటే, అతను విషం త్రాగి చావ కుండా వున్నప్పుడు, అతను శరీరానికి నిప్పంటించుకుని తగల పడకుండా వున్నప్పుడే అతని వాదనను నమ్ముతారు.

మనుస్మృతిని క్రీ.శ రెండవ శతాబ్దంలో క్రోడీకరించారని భావిస్తున్నారు. అది మొత్తంగా హిందూమత న్యాయ వ్యవస్థను ప్రతిబింబిస్తుంది. 1927లో మహారాష్ట్రలోని మహద్ లో జరిగిన సామూహిక సత్యాగ్రహంలో పాల్గొన్న డా.అంబేద్కర్ మానవత, సమన్యాయం, సమానత్వం అనే సూత్రాలను ఉల్లంఘిస్తున్న మనుస్మృతి ప్రతిని బహిరంగంగా తగలబెట్టారు.

ఆర్ ఎస్ ఎస్ అధికార పత్రికగా వున్న ఆర్గనైజర్ (నవంబరు 30, 1949 పేజీ 3)లో మనుస్మృతి పై తన ఆలోచనల్ని బయట పెట్టింది." మన రాజ్యాంగంలో ప్రాచీన భారతదేశంలోని పవిత్రమైన రాజ్యాంగ పరిణామాల ప్రస్తావనే లేదు. మను సూత్రాలు స్పార్టాలోని లికర్గస్ లేదా పర్షియాలోని సొలాన్ కంటే ముందే వ్రాయబడినాయి. మనుస్మృతిలో వివరించబడ్డ సూత్రాలు ఈ రోజుకూ, యావత్ ప్రపంచంచే కొనియాడబడుతూ అప్రయత్న పూర్వకమైన విధేయతను, అంగీకారాన్ని పొందగలుగుతున్నాయి. కాని మన రాజ్యాంగ పండితులకు (వాళ్ళ దృష్టిలో అంబేద్కర్) అంటే లెక్కలేదు."

ఈ రోజుకూ ఆర్ఎస్ఎస్ కొనియాడుతున్న సూత్రాలేమిటి?

తిరగపడేటట్లు రెచ్చకొట్టే మనుస్మృతిలోని రెండు నిర్దేశాలు : 1. అగ్రవర్ణాలు వదిలేసిన చిరిగిన గుడ్డల్నే శూద్రులు ధరించాలి. వాళ్ళు తిని వదిలేసిన ఆహారాన్నే శూద్రులు భుజించాలి. విరిగిన మట్టి పాత్రలనే వాడాలి. 2. శూద్రుల్ని మానవుల కంటే పరమహీనంగా పరిగణించటం కోసం, వాళ్ళని అసహ్యకరమైన పేర్లతో

పిలవాలనేదాక మనుస్మృతి వెళ్ళింది. ఈ సూత్రాల్ని ప్రత్యేకించి దళితులు, మహిళలపై బలవంతంగా రుద్దారు. భారత సమాజంలో ఈ రకమైన వ్యక్తిగత పేర్లతో పిలిచే సూత్రం అమలులో వుంది. ఇప్పటికి రెండు తరాల ముందు వరకు దళిత మహర్లలో హగ్ర్య (మలం), భికర్య (బిచ్చగాడు). జంగ్ల్య (ఆటవిక), ఫక్రియ (బిచ్చగాడు) లాంటి పేర్లు పిలువబడుతూనే వుండేవి. ఈ వ్యాసకర్త తాత పేరు ఫాంద్య (మోసకారి), ముత్తాత పేరు పుక్తు (బిచ్చగాడు), మామ పేరు జంగ్ల్య (ఆటవిక), దళితుల్ని మనస్మృతి హీనంగా చూడటమే కాకుండా వాళ్ళ వ్యక్తిత్వాన్ని అమానుషంగా అణగద్రొక్కింది. వాళ్ళకు వారు మంచి పేర్లతో పిలుచుకునే హక్కు కూడా లేకుండా చేసింది.

దళితుల పట్ల ఇతర ధర్మ శాస్త్రాలు, ఇతిహాసాలు ఇదే దుర్మార్గాన్ని అనుసరించాయి. దళితుల్ని అసమర్థుల్నిగా పరిగణించేవారు. వాళ్ళకు చదువుకునే అవకాశాన్ని నిరాకరించి, అతి హీనంగా చూశారు. ఈ దురాచారం అనేక శతాబ్ధాలు కొనసాగింది. అగ్రకులాల మనో తృప్తి కోసమే కాకుండా, దోపిడీ వ్యవస్థపై తమ వర్గ కులాధిపత్యాన్ని నిలబెట్టుకోవటం కోసం దళితుల్ని ఇలా హీనంగా చూసి వారు కుల వ్యవస్థ యొక్క భూస్వామ్య న్యాయ వ్యవస్థలను నిలబెట్టేందుకు ధర్మశాస్త్రాలు, ఇతిహాసాలు, స్మృతులు అన్యాయమైన హిందూ సమాజపు స్తంభాలుగా వున్నాయి. ఈ స్తంభాలు లేకుండా హిందూమతాన్ని హిందూత్వను ఊహించలేము.

## ఆర్ఎస్ఎస్ – కుల వ్యవస్థ

ఆర్ఎస్ఎస్, దాని హిందూత్వ సిద్ధాంతం ఈ ప్రాచీన ధర్మగ్రంధాలపై ఆధారపడి వుంది. ఆర్ఎస్ఎస్ పూర్వ అధినేత గోల్వాల్కర్ తన "ఆలోచనల సమాహారం (బంచ్ ఆఫ్ థాట్స్)" పుస్తకంలో వ్రాస్తూ, ధర్మ మనేది జీవన మార్గమన్నారు. ధర్మమంటే ఆయన దృష్టిలో వర్ణ ధర్మమే కాని మత ధర్మం కాదన్న అంశం మన గమనంలో వుండాలి. ఈ పుస్తకంలోని రెండవ భాగం, పదవ అధ్యాయంలో ఆయన వర్ణాశ్రమ ధర్మాన్ని కీర్తిస్తూ, 'జాతి, దాని సమస్యలు' అన్న శీర్షికన ఇలా వ్రాశారు. "భగవంతుని నాలుగు భాగాల సాక్షాత్కారంగా సమాజం పరిగణింపబడుతూ, మనందరిచే ఆరాధింపడుతున్నది". అదే అధ్యాయంలో కుల వ్యవస్థ గూర్చి ఆయన ఇలా చెప్పారు." అలనాటి ప్రాచీన కాలాల్లో కూడా కులాలు

కీర్తింపబడి, మన జాతి జీవనాల్లో వేలాది సంవత్సరాలుగా కొనసాగుతూ మన సమాజ ఐక్యతకు గొప్ప బంధంగా పనిచేశాయి"

గోల్వాల్కర్ కుల వ్యవస్థను మరింతగా ఆకాశానికెత్తుతూ ఇలా వ్రాశారు. "కుల వ్యవస్థ నిజంగా మన బలహీనతకు మూల కారణమై వుంటే, కులాలు లేని విదేశీయుల దాడులకు మన వాళ్లెప్పుడో సునాయాసంగా ఓడిపోయి వుండేవారు"

గోల్వాల్కర్ కులం మీద, మతతత్వంపై వ్రాసిన రచనల్లో వేటినీ ఆర్‌ఎస్‌ఎస్ తిరస్కరించలేదన్న విషయాన్ని నొక్కి చెప్పాలి. అందువలన ఆర్‌ఎస్‌ఎస్ కుల వ్యవస్థను మనస్ఫూర్తిగా అంగీకరిస్తుంది. అది సామరస్యాన్ని గూర్చి మాట్లాడుతుంది. కాని సమానత్వాన్ని గూర్చి మాట్లాడదు. ప్రతి కులం తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలని కోరుతుంది కాని కుల నిర్మూలనను అది కోరదు.

ఇక్కడొక ఆసక్తికరమైన అంశం చెప్పుకోవాలి. 1820-1890 మధ్యకాలంలో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలేలు బ్రాహ్మణాధిక్యతను, దానికి అనుబంధంగా వున్న పితృస్వామ్య భావనను సవాలు చేస్తూ సత్యశోధక సమాజ్‌ను స్థాపించి బ్రహ్మాండమైన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించారు. ఆ ఉద్యమం ప్రజల్లో సృష్టించిన ప్రభావాన్ని కొంతమేరకు నివరించటానికి ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించబడింది. కుల వ్యవస్థ యొక్క అణచివేత నిర్మాణాన్ని సంపూర్తిగా కూలతోయాలనే దృఢ సంకల్పంతో ముందుకొచ్చిన జ్యోతిబా పూలేను 19 శతాబ్ధపు విశిష్టమైన విప్లవకారుడిగా, కుల వ్యవస్థ యొక్క భారతదేశపు మొట్టమొదటి శాస్త్రీయ సిద్ధాంత కర్తగా డా. అంబేద్కర్ అభివర్ణించారు. ఆయన సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో శూద్రులు, అతి శూద్రుల బాలికలకు మొట్టమొదటగా పాఠశాలను మొదలెట్టారు. భారతదేశ మొదటి స్త్రీవాద తాత్వికవేత్త "స్త్రీ పురుష తూలన" అని చిన్న గ్రంథ రచయిత్రి తారాబాయి షిండే, భారతదేశంలో మొదటి కార్మిక సంఘ స్థాపకులు నారాయణ మేఘజి లోఖండే లాంటివారు సత్య శోధక్ సమాజ్ యొక్క క్రియాశీల కార్యకర్తలే.

డా. హెగ్డేవార్ "సంఘ్ వృక్ష కె బీజ్' అనే తన జీవిత చరిత్రలో దాన్ని వ్రాస్తున్న సి.పి. భిషికర్‌కు చెప్పుతూ, "బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం ఉధృతం కావటం

ఆర్ఎస్ఎస్ స్థాపనకు గల కారణాలలో ఒకటిగా" పేర్కొంటారు.

ప్రధాని మోడి 2001లో ముఖ్యమంత్రి కాక పూర్వం చాలా కాలంపాటు ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా వుండేవారు. ఆయన 2008లో తనను అమితంగా ప్రభావితం చేసిన 16 మంది సంక్షిప్త జీవిత చరిత్రలున్న ఒక పుస్తకంగా ప్రచురించారు. అందులో ఒకరైన ఎంఎస్ గోల్వాల్కర్‌ను ఆయన కీర్తించటం ఆశ్చర్యకరమైన అంశమేమి కాదు.

**ఆర్ఎస్ఎస్ – దళితులు**

ఆర్ఎస్ఎస్ దళితుల్ని బాహాటంగా అంటరానివారుగా పరిగణించే సాహసం చేయకపోయినా, దళిత ప్రజల ప్రయోజనాల్ని పటిష్టపరిచే ప్రతి సంస్కరణ, రాజ్యాంగం, చట్టం, రిజర్వేషన్ విధానాన్ని అది వ్యతిరేకిస్తూనే వుంది.

1950 ఫిబ్రవరి 6 తేదీ గల ఆర్గనైజర్ పత్రికలో రిటైర్డ్ హైకోర్టు జడ్జి శంకర్ శుభ అయ్యర్, 'మను సూత్రాలు, మన హృదయాలు' అన్న వ్యాసంలో ఇలా వ్రాశారు. "డా. అంబేద్కర్ ఇటీవల బొంబాయిలో మనువు కాలం గతించిందని చెప్పినప్పటికీ, హిందువుల నిత్య జీవితాలు ఇప్పటికీ మనుస్మృతి, ఇతర స్మృతుల సూత్రాలతో ప్రభావితమౌతూనే వున్నాయి. సనాతన భావాలు లేని హిందువు కూడా ఆ స్మృతుల సూత్రాల్ని కొన్నింటినన్నా పాటించాల్సి వుంటుంది. వాటిని పాటించకుండా వుండలేని శక్తిహీనుడుగా బాధపడుతుంటాడు."

గోల్వాల్కర్ తన "ఆలోచనల సమాహారం" అన్న పుస్తకంలో ఇలా చెప్తారు." మన రాజ్యాంగం పశ్చిమ దేశాల వివిధ రాజ్యాంగాలలోని అధికరణలతో సంక్లిష్టంగా బహుళ జాతి కదంబంగా వుంది." "దానిలో మన స్వంతం అనుకునేది ఏమీ లేదు. దాని మార్గదర్శ సూత్రాలలో మన జాతీయ ధ్యేయం ఏమిటో, మన జీవిత మూలసూత్రం ఏమిటో తెలియచెప్పే ఒక్క మాట ఉన్నదా?" అని ప్రశ్నిస్తారు.

"మనుస్మృతిలో వుండే తన ప్రాచీన సంబంధాల్ని హిందూ చట్టం తెంచుకోవటంలోని సహేతుకతను, ఆర్ఎస్ఎస్ రెండవ అధినేత గోల్వాల్కర్ చూడలేకపోయారని" ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త కెఆర్ మల్కాని తన "ఆర్ఎస్ఎస్

కథ" అన్న గ్రంథంలో అంగీకరించారు. కులం, జాతి, లింగం, భాషలతో నిమిత్తం లేకుండా చట్టం ముందు అందరూ సమానం అని చెప్పే రాజ్యాంగానికి బదులు, మనిషిని మనిషిగా గుర్తించకుండా అసమానత్వాన్ని ప్రబోధించే మనుస్మృతిపై ఆధారపడ్డ హిందూత్వ మన జాతీయ ధ్యేయంగా వుండాలన్నది ఆర్ఎస్ఎస్ స్పష్టమైన ఆలోచనగా వుంది.

ఆర్.ఎస్.ఎస్, దళితుల ఆందోళనలనుగాని, దళితుల ఆలయ ప్రవేశాన్ని గాని ఎన్నడూ సమర్ధించలేదు. మనకు స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, అనేక దేవాలయాల్లో దళితుల ప్రవేశాన్ని అనుమతించడం లేదు. అదేవిధంగా ప్రాచీన హిందూ సంప్రదాయాల్లో భాగంగా వుండి ఇప్పటికి సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ బహిరంగంగా ముందుకు రాలేదు.

న్యూ ఢిల్లీ లోని వసంత్ కుంజ్ లో ఒక వేదాధ్యయన సంస్థ శంఖు స్థాపనకు ఆర్ ఎస్ ఎస్ లో చిరకాల అనుభవం వున్న నాయకుడు ఎల్.కె. అద్వాని హాజరయ్యారు., ఆ సందర్భంలో అక్కడున్న దుసద్ కులానికి చెందిన పది దళిత కుటుంబాలు ఆ ప్రాంతాన్ని మలిన పరుస్తాయని భావించి, ఆ సభ నిర్వాహకులు ఆ దళిత కుటుంబాలను బలవంతంగా బయటకు పంపించారు. ఎల్.కె.అద్వాని తో సహా ఏ ఒక్క ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తా అందుకు అడ్డు చెప్పలేదు.

అక్టోబర్ 2002లో హర్యానా నందలి ఝజ్జర్ జిల్లాలోని దులేనాలో ఐదుగురు దళితులు, చనిపోయిన ఆవు చర్మాన్ని అమ్ముకోవటం కోసం వలుస్తున్నారు. స్థానిక విశ్వ హిందూ పరిషత్ మరియు శివసేన కార్య కర్తలు, ఆ దళితులు గోవధకు పాల్పడ్డారని పుకార్లు లేపారు. ఆ దళితుల్ని చిత్రవధకు గురిచేశారు. ఈ దారుణాల్ని హత్యల్ని ఖండించకుండా, విశ్వహిందూ పరిషత్ నాయకుడు, గిరిజా కిషోర్ ఈ చిత్రవధను సమర్ధిస్తూ, ఎంతో మంది మనుషులు ప్రాణాల కంటే గోవు ప్రాణం ముఖ్యమన్నారు. ఈ సంఘటన పై కూడా ఆర్ ఎస్ ఎస్ పల్లెత్తు మాట అనలేదు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వంలో క్యాబినేట్ మంత్రి గా వున్న ఉమా భారతి తాను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి వున్నప్పుడు గోవధను నిషేదిస్తూ ఆర్డినెన్స్ తెచ్చారు.

జనవరి 2005లో మనుస్మృతి లోని గుణగణాల్ని ప్రశంసిస్తూ ఈ క్రింది మాటలలో అధికార ప్రకటన చేసారు.

"గోవధ చేసినవాడిని దోచుకునే వాడిగా పరిగణించి, మనుస్మృతి వాడికి కఠినమైన శిక్షను ప్రసాదిస్తుంది." మనుస్మృతి ఆదారంగా ఒక చట్టాన్ని సమర్థించు కోవటం స్వతంత్ర భారత దేశంలో ఇదే మొదటి ఘటనేమో? ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. 1990 తొలినాళ్లలో బిజెపి ప్రభుత్వం జైపూర్ హైకోర్టులో "మనువు" యొక్క మహత్తర స్తూపాన్ని ప్రతిష్టించింది. మానవ చరిత్రలో ఎప్పుడూ ఎరుగనంతగా క్రింది కులాల ప్రజానీకంతో పాటు అగ్ర కులాల మహిళలను దుర్మార్గమైన బానిసత్వంలో వుంచే మనుస్మృతి చే ఈ దేశం పాలింప బడాలని వారు కోరుతున్నారు. ఇటీవలె హర్యానాలోని ఫరిదాబాద్‌లో అగ్రవర్ణ కులస్థులు దళిత కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్న పిల్లల్ని సజీవంగా తగులబెట్టారు. ఆ పిల్లల తల్లిదండ్రులకు మంటల్లో తీవ్రమైన గాయాలైనాయి. ఈ పైశాచిక ఘటన పట్ల ఆర్ ఎస్ ఎస్ మౌనాన్ని మనం ఏమనుకోవాలి?



లోక మాన్య జయ ప్రకాష్ నారాయణ్ నాయకత్వం వహించిన సంపూర్ణ క్రాంతి ఉద్యమంలోకి ఆర్ ఎస్ ఎస్ దూకింది. అగ్ర కుల ఆధిపత్యతకు చిహ్నంగా వున్న "జంధ్యాన్ని తెంచండి!" అన్న జయప్రకాశ్ పిలుపును ఆర్ ఎస్ ఎస్ లెక్కచేయలేదు. కనీసం ఒక్క ఆర్ ఎస్ ఎస్ కార్యకర్త కూడా ఈ పిలుపును అమలు పరచలేదు. ఆర్ ఎస్ ఎస్ కుల దొంతరలను స్థిరంగా విశ్వసించటం వల్ల ఇలా జరిగింది.

రిజర్వేషన్ విధానాన్ని సమీక్షించాలనే ప్రకటన ఆర్ ఎస్ ఎస్ అజెండాలో ఒక భాగం. దళితులు, వెనుకబడిన కులాలు, ఆదివాసీల సాధికారికతను ఆర్ ఎస్ ఎస్ ఎన్నడూ కోరదు. మండల్ కమిషన్ సిఫార్సులు అమలుచేసేటప్పుడు మతోన్మాద సమీకరణను ప్రేరేపించటానికి అద్వానీ నాయకత్వంలోని బిజెపి రామజన్మ భూమి ఉద్యమాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభించింది. ఆర్ ఎస్ ఎస్ మద్దతుదారులు రిజర్వేషన్ వ్యతిరేక ర్యాలీలను వుధృతం చేశారు. ఆత్మాహుతి సంఘటనలు పెరిగిపోయాయి. హిందూత్వ శక్తులు వీటి  వెనుక వుండి నడిపించాయి. వి.పి.సింగ్ ప్రభుత్వానికి బిజెపి మద్దతు ఉపసంహరణతో, ఆ ప్రభుత్వం పడిపోయింది.

ఢిల్లీకి దగ్గరలోని ఉత్తరప్రదేశ్ నందలి దాద్రిలో, అఖలక్ ఇంట్లో ఆవు మాంసం వుందనే పుకార్లతో అతడు చిత్రవధకు గురికాబడ్డాడు. ఆవు మాంసం తినేవారిని సంహరించమని వేదాల్లోని ఆజ్ఞకు అనుగుణంగా ఈ సంఘటన వుందని కొందరు ఆర్ ఎస్  ఎస్ వ్యక్తులు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. అటువంటప్పుడు మహారాష్ట్రలోని మహర్లనబడే దళిత కులస్తుల పట్ల ఆర్ ఎస్ ఎస్ ఎలా వ్యవహరించ దలచుకుంది? వేటమాంసం కంటే ఆవు మాంసం చౌక గనుక దాన్ని మహర్లు తింటున్నారు. రెండు తరాల క్రితం మహర్ కులానికి ఆవుమాంసం తప్పనిసరి ఆహారంగా వుండేది.

ఇన్ని పరిణామాలు ఉన్నప్పటికీ, దళితుల్లో ముస్లింల్లో ఒక ప్రక్క వ్యతిరేకతను రెచ్చగొడుతూ, మరో ప్రక్క రకరకాలైన పద్ధతులతో ఆర్ ఎస్ ఎస్, బిజెపి, వారిలోని గణనీయమైన వర్గాన్ని తమ వైపుకు మలుచుకోవటంలో విజయవంత మౌతున్నది. అంబేద్కర్‌ను తమ స్వంతం చేసుకొనటానికి, ఆయన భావాల్ని

వక్రీకరిస్తున్నారు. అందువల్ల మతోన్మాద వ్యతిరేక పోరాటంలో అంతర్భాగంగా కుల వ్యతిరేక పోరాటాన్ని తక్షణంగా నిర్మించాల్సిన అవసరం వుంది. ఇక్కడా డా. అంబేద్కర్ చెప్పిన ఒక అంశాన్ని గమనంలో వుంచుకోవాలి. అత్యధికముస్లింలతో సమానమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రయోజనాలు కలిగిన నిమ్న వర్గాల ప్రజానీకం హిందూ సమాజంలో విస్తారంగా వున్నారు. శతాబ్దాలుగా తమ సాధారణ హక్కుల్ని కాలరాసిన అగ్రవర్ణ హిందువులతో కంటే వారు ఉమ్మడి ప్రయోజనాల సాధనకు ముస్లిములతో జతకట్టటానికి సిద్ధంగా వున్నారు.

**(డా. అంబేద్కర్, రచనలు, మరియు ప్రసంగాలు వాల్యూం 8, 359 పేజీ)**

మనుస్కృతి లాంటి పురాతన గ్రంథాలలో ప్రస్తావించిన భావాల కనుగుణమైన మతరాజ్య స్థాపనే ఆర్ ఎస్ ఎస్ ధ్యేయంగా వుంది. ఈ రాజ్యం దళితులకు గిరిజనులకు, ముస్లిములు, క్రిష్టియన్లు లాంటి హిందూ మతేతరులకు, అభ్యుదయగాములకు శత్రువుగా వ్యవహరిస్తుంది. మనం ఎన్నడూ చూడని అమానుషమైన, అపాయకరమైన, వికటమైన నియంతృత్వాన్ని అది అమలు చేస్తుంది. అందువల్ల దేశ భక్తులు, ప్రజాస్వామ్య అభిలాషులు ఆర్ ఎస్ ఎస్, దాని విభిన్న ముఖాలకు వ్యతిరేకంగా పోరాడటం తమ విధిగా భావించాలి.

*

# ఆర్ ఎస్ ఎస్ ప్రాపంచిక దృక్పథంలో మహిళలు

**- శుభ, సుభాషిణీ అలీ, డా. హేమలత**

ఆర్ ఎస్ ఎస్ దాని అనుబంధ సంస్థల స్త్రీ, పురుష నాయకుల వ్యాఖ్యలు ప్రకటనలు, వారి కార్యకలాపాలను బట్టి మహిళల పట్ల ఆర్ ఎస్ ఎస్ వైఖరిని అర్థం చేసికోవచ్చు. మతాలతో సంబంధం లేకుండా మహిళల సమానత్వం, సమాన పౌరసత్వాలపై వివిధ మత ఛాందస వాదుల భావాలు దాదాపుగా ఒకే విధంగా వుంటాయి. నరేంద్ర మోడీ పాలనలో విధానాల నిర్ణయాత్మక శక్తిగా ఆర్ ఎస్ ఎస్ ఉండటమే భారతదేశంలో నేడు నెలకొన్న ప్రత్యేక పరిస్థితి. అనేక పోరాటాలతో త్యాగాలతో రాజకీయ, సామాజిక, ఆర్థిక, న్యాయ రంగాలలో భారతీయ మహిళలు సాధించుకున్న ప్రయోజనాలు అవి ఎంత అరకొరగా, అసంపూర్తిగా వున్నా, వాటినన్నింటిని 'ఉన్నత నైతిక నిబంధనావళి' పేర హరించటానికి ప్రయత్నిస్తూ, వారిని సంప్రదాయం ముసుగులో నాలుగు గోడల మధ్య మగ్గే బానిసలుగా మార్చాలని ఆర్ ఎస్ ఎస్ చూస్తున్నది.

## ఆర్ ఎస్ ఎస్ ముఖ్య అధినేత ప్రవచనాలు

డిసెంబర్ 2012లో ఢిల్లీలో జరిగిన సామూహిక మానభంగం (ఢిల్లీ గ్యాంగ్ రేప్) దేశవ్యాప్తంగా గొప్ప అలజడిని సృష్టించింది. వేలాది మంది యువకులు, యువతులు వీధులలో కొచ్చి కిరాతకమైన ఈ సంఘటనకు బాధ్యులైన నిందితుల్ని కఠినంగా శిక్షించటమే కాకుండా మహిళలకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని

డిమాండ్ చేశాయి. కాని ఈ అంశంపై ఆర్ ఎస్ ఎస్ అధినేత మోహన్ భగత్ అభిప్రాయాలు భిన్నంగా వున్నాయి. 'పట్టణ ప్రాంతాలలోని ప్రజలు అనుసరిస్తున్న పాశ్చాత్య జీవన విధానమే ఇటువంటి సంఘటనలకు కారణమని' ఆయన నిందిస్తూ, ఈ సంఘటన జరిగిన కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ ప్రకటన చేశాడు. సామూహిక మానభంగాలు, లైంగిక నేరాలు పట్టణ భారతంలో జరుగుతున్నాయని, పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడక పోవటం వల్ల గ్రామీణ భారతంలో అవి జరగటంలేదని ఆయన చెప్పుకొచ్చారు ఈ ప్రకటనపై తీవ్రమైన విమర్శలు రేగడంతో, ఆర్ ఎస్ ఎస్ ప్రకటన కర్తలు, స్వయం సేవికులు, బిజెపి నాయకులు ఆత్మ రక్షణ లో పడి, ఆయన మహిళలను గౌరవిస్తున్న భారతీయసంస్కృతిని, మానభంగాలకు దారితీస్తున్న పాశ్చాత్య సంస్కృతిని గూర్చి మాట్లాడారని సర్ది చెప్పారు.

నైతిక నిఘా పేరు మీద దీని అనుబంధ సంఘాలన్నీ కర్ణాటకలో పబ్‌ల మీద దాడిచేయటం, ప్రేమికుల రోజు(వాలెంటైన్ డే)న యువ జంటలపై దౌర్జన్యం చేయటం, వేషధారణలపై నిబంధనల్ని విధించటం లాంటి చర్యలకు పాల్పడటం మొదలెట్టాయి.

ఇటీవలనే ఆర్ ఎస్ ఎస్ నిర్వహిస్తున్న పాఠశాలలో 'తనకుతానే' దేవుడిగా ప్రచారం చేసికుంటున్న ఆశారాం బాపు గొప్పతనాన్ని బోధిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ ఆశారాం బాపు 'ఢిల్లీ గ్యాంగ్ రేప్' సంఘటన గూర్చి మాట్లాడుతూ, "దౌర్జన్యకారుల్ని అన్నలుగా సంబోధించి, బ్రతిమాలు కున్నట్లయితే వారి నుండి ఆమె బయట పడకలిగే" దన్నారు. ఈ ఆశారాం బాపునే ప్రస్తుతం లైంగిక వేధింపులు, మానభంగం నేరాల క్రింద జైలులో వున్నాడు. ఆయన మద్దతుదారులు ఆయన పై ప్రచురించిన పుస్తకాల్ని సరస్వతీ విద్యా మందిర్ విద్యార్థులకు పంచుతున్నారు.

మళ్ళీ భగవత్ వివాహం లో మహిళ స్థానాన్ని గూర్చి మాట్లాడి వార్తల కెక్కారు. కార్యకర్తల నుద్దేశించి ఆయన ఇలా మాట్లాడారు. "భార్య భర్తలు ఒక ఒప్పందానికి కట్టుబడివున్నారు ఆ ఒప్పందం ఇలా చెప్తుంది. 'నీవు (మహిళ) ఇంటిపనులు చేస్తూ నన్ను తృప్తి పరచాలి. క్రమం తప్పకుండా నీవు నీ విధుల్ని

నిర్వర్తిస్తూ, ఒప్పందాన్ని గౌరవించినంత కాలం నేను (మనిషి) నీ అవసరాలు తీరుస్తూ నిన్ను రక్షిస్తాను. నీవు ఒప్పందాన్ని గౌరవించకపోతే నిన్ను వదిలేస్తాను.----"

భగవత్ చేసిన ఈ ప్రసంగాలేవీ ఆయన అనాలోచిత భావాలు కావు. ఇది ఆర్ ఎస్ ఎస్ కు దాని అనుబంధ సంఘాలకు స్ఫూర్తి నిచ్చి మార్గ దర్శనం చేసిన పితృస్వామ్య, మధ్యయుగాల సిద్ధాంతం.

**ఆర్ ఎస్ ఎస్ భావన లో శ్రామిక మహిళలు**

అటువంటి ఆలోచనలను బిజెపి పాలిత రాష్ట్రాలలో పాఠ్య పుస్తకాల్లో ప్రచురిస్తున్నారు. ఈ మధ్య కాలంలో చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో జష్పూర్ నందలి ఒక గిరిజన పాఠశాలలో ఒక యువ మహిళా టీచర్ తాను బోధిస్తున్న 10వ తరగతి సామాజిక శాస్త్రం లోని పాఠ్యాంశంలో వ్రాసిన 'శ్రామిక మహిళను అవహేళన పరుస్తున్న' వ్యాఖ్యపై తీవ్రమైన నిరసనను వ్యక్తం చేసింది. ఆ పాఠ్యంశం లో, "నిరుద్యోగ సమస్యకు శ్రామిక మహిళలు కారణం. స్వాతంత్ర్యం తర్వాత అన్ని రంగాల్లో మహిళలు పనిచేయటం అధిక మైనందున నిరుద్యోగ శాతం పెరిగింది". మరో మాటలో చెప్పాలంటే దేశంలోని నిరుద్యోగ సమస్యకు ప్రభుత్వ విధానాలు కారణం కాదు, శ్రామిక మహిళలే కారణం అన్నది ఆ పాఠ్యాంశ సారాంశం. పట్టణ ప్రాంతాలలో ప్రత్యేకించి గ్రామ సీమల్లో కుటుంబాల మనుగడ మహిళల ఉపాధి, ఆదాయాలపై ఆధారపడి వుండి, మూడవ వంతు కుటుంబాలు మహిళల కష్టం పై జీవిస్తున్న నేపథ్యంలో జరుగుతున్న ప్రచారమిది. "దేశంలోని నిరుద్యోగ శాతాన్ని మగవారి నిరుద్యోగం పై ఆధారపడి లేక్కిస్తారా?" అని ఛత్తీస్ ఘడ్ లోని యువతి ప్రశ్నించింది. మగవారికి, మహిళలకు ఉద్యోగార్హతలో సమాన హక్కులు వుండాలని నమ్మేవారు ఈ ప్రశ్నను నిజంగా అడుగ గలుగుతారు. కాని ఆర్ ఎస్ ఎస్ ప్రాపంచిక దృక్పథం అది కాదు.

**ఆర్ ఎస్ ఎస్ మహిళా విభాగాలు**

రాష్ట్రీయ సేవికా సమితి మరియు దుర్గా వాహిని లాంటి మహిళా శాఖాలతో సహా ఆర్ ఎస్ ఎస్ సంబంధించిన అన్ని విభాగాలు కుటుంబంలో

మహిళల పాత్ర, గృహ హింస, వరకట్నాలు మరియు సమాజంలో మహిళాపాత్ర సంబంధించిన అన్ని అంశాలలో ఒకే రకమైన సిద్ధాంతాన్ని, దృక్పధాన్ని కలిగి వుంటాయి. సంఘ్ పరివార్ కు చెందిన మహిళా సంఘాలన్నీ మహిళలను పితృస్వామ్య ప్రమాణాల్ని ప్రచారం చేసే సాధనాలుగా వినియోగించుకుంటున్నాయి.

ఆర్ ఎస్ ఎస్ విభాగమైన విశ్వ హిందూ పరిషత్ మహిళా శాఖ నాయకురాలైన కృష్ణ శర్మ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "మహిళలు ఇంటిపని నిర్వహించాల్సి ఉన్నందున, సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవటంకోసం మగవాడికి విద్య చాలా ముఖ్యమైంది. ఈ రకమైన పని విభజన సహజసిద్ధమైనది." అని ఆవిడ అన్నారు.

రాష్ట్రీయ సేవికా సమితి ఆడపిల్లలలో, యువతులలో మహిళలలో ఈ రకమైన భావాలను ఎక్కిస్తుంటుంది. వివిధ రకాల శిబిరాలు నిర్వహించటంతో పాటు వినాయక చవితి, కర్వచౌత్ లాంటి పండగల్ని ఈ రకమైన సిద్ధాంత వ్యాప్తికి వినియోగించుకుంటాయి. దేవాలయదర్శనం, ఉపవాస ఆచరణ పుణ్యక్షేత్రాల దర్శన లాంటి ఆచారాల్ని ప్రతిరోజు నిర్వహించటానికి సమితి ఒక క్యాలెండర్‌ను తయారు చేస్తుంది. పాటించాల్సిన దినోత్సవాలకు సంబంధించిన రాజకీయ కార్యకలాపాలను మటుకు తప్పిస్తుంది. రాష్ట్రీయ సేవికా సమితి భావనలో, భారతీయ స్త్రీలకు ఇప్పటికే తగిన హక్కులున్నాయని, సమాన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం లేదని భావిస్తుంది.

ఆర్ ఎస్ ఎస్ రాజకీయ విభాగమైన బిజెపి సామాజిక మీడియాలో చురుకుగా వుంటే, యవ్వనంలోని బాలికలు సామాజిక మీడియాలో తమ ఫోటోచూసికోనే అలవాటును దాని మహిళా విభాగం నిరుద్యోగ సమస్య స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యగా చూస్తున్నది. ఒక ప్రచారిక అభిప్రాయంలో వయస్సులో వున్న ఆడపిల్లల్ని ఫేస్ బుక్ లాంటి వెబ్ సైట్‌లో ఫోటోలు పోస్ట్ చేసికోవటాన్ని ఆపించాలని, లేకపోతే వాళ్ళు బ్లాక్ మైలింగులకు గురి అవుతారని భావిస్తుంది. ఈ అంశంలో వీరి అభిప్రాయాలు, సున్ని ముస్లిం మత సంస్థ అయిన దర్గా ఆలా

హజరత్ కు సంబంధించిన మదరసా మంజూర్–ఇ–ఇస్లాం అభిప్రాయాలు ఒకటిగా వున్నాయి. ఈ ముస్లిం సంస్థ ఇంటర్నెట్ లోను, సామాజిక మీడియా సైట్లలో ఫోటోలను ఆపలోడ్ ను నిషేదిస్తూ ఫత్వాను జారీ చేసింది.

రాష్ట్రీయ సేవికా సమితి దృష్టిలో మహిళలు మంచి భార్యలుగా మంచి తల్లులుగా వుండటాన్ని ఆకాంక్షించాలి కాని బయట ఉద్యోగాలు చేయటానికి కాదు. ఆ సంఘం మాన్యుల్ ఇలా చెప్తుంది, "పెండ్లి అయిన తర్వాత నూతన గృహంలో అమ్మాయిలు అనేక భాద్యతలు నిర్వహించాల్సి వుంటుంది, "పిల్లల దుష్ప్రవర్తనను తల్లిదండ్రులు మందలించరా? తల్లిదండ్రులతో పిల్లలు ఎలా సర్దుకుపోవాలో, అలాగే భార్య కూడా భర్త ధోరణిని బట్టి సర్దుకు పోవాలి. అతన్ని రెచ్చగొట్టేటట్లు ప్రవర్తించకూడదు. ఇలా చేస్తేనే కుటుంబ సామరస్యం నిలబడి వుంటుంది. ఎటువంటి పరిస్థితులున్నప్పటికీ, భార్య సర్దుకుపోవాల్సిందే. ఇక్కడ మన కర్తవ్యం కుటుంబాన్ని కలపటం తప్ప విడగొట్టటం కాదు. అందువల్లనే మనం మహిళలను సర్దుకుపొమ్మని చెప్తాం. అప్పుడప్పుడు మనం భర్తలకు కౌన్సిలింగు ఇవ్వటానికి ప్రయత్నిస్తాం." ఒక ప్రచారిక అభిప్రాయంలో "కుటుంబాన్ని పణంగా పెట్టి మహిళలు ఎక్కువ స్వేచ్ఛను కోరుతుంటారు. ఇది వినాశకరమైన దృక్పధం." (అవుట్ లుక్ పత్రికలో నేహ దీక్షిత్ వ్రాసిన" గోవు కన్న పవిత్రమైనది')

## వివక్షతను సహేతుకం చేస్తున్న ఆర్ఎస్ఎస్

పై అంశాలను బట్టి ఆర్ఎస్ఎస్ మహిళా సమానత్వాన్ని సమర్థించదని తెలుస్తుంది. కుటుంబంలోని, సమాజంలోని మహిళా సంబంధాల్లో మార్పుల్ని ఆర్ఎస్ఎస్ ఇష్టపడదు. సమాజంలో కొనసాగుతున్న మహిళల అణిచివేతను, వివక్షతను ప్రస్తుత సంప్రదాయాలు, ఆచారాల చట్రంలోనే అవి చట్టసమ్మతిని కోరుతున్నాయి. సమాజంలో మహిళ పట్ల తీవ్రమైన వివక్ష, హింసలకు సంబంధించిన దృష్టాంతాలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నప్పటికీ, పితృస్వామ్య పాలన, అసమానత్వం లాంటి సంఘ్ సైద్ధాంతిక అవగాహన దాని మహిళా సంఘాలకు స్ఫూర్తినిస్తుంది. వాళ్ళు మైనారిటీలను హిందూ జాతి శత్రువులుగా భావిస్తారు.

సమాజంలోని అన్ని సమస్యలకు మైనారిటీలే కారణమంటూ హిందూ సమాజంలోని మహిళల సమస్యలతో పాటు అన్ని రకాల అసమానతలు, వివక్షల నుండి దృష్టి మళ్ళిస్తుంటారు. బహుశా ఆ సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ హిందూ సమాజం ముక్కలై అగౌరవ పడుతుందనేమో ఆర్ఎస్ఎస్ మహిళా సంఘాలెన్నడూ కట్నాల వేధింపు, గృహహింస లాంటి సమస్యలను పట్టించుకున్న దాఖలాలు కనపడవు. బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు మృదులా సిన్హా 1993లో టెలిగ్రాఫ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నేను నా కుమార్తెకు కట్నం ఇచ్చాను, కుమారుడికి కట్నం తీసుకున్నాను.... భార్యని కొట్టడం మంచిది కాదు. కాని ఆమెను సరైన మార్గంలో పెట్టాల్సి వస్తే అది మంచిదే.' కట్నం ఇవ్వడం, స్వీకరించటం చట్టపరంగా నేరమని నిజాన్ని గూర్చి ఆమె లెక్క చేయటంలేదు.

ప్రఖ్యాత విద్యావేత్త తనిక సర్కార్ సేవకల్ని అధ్యయనం చేసి, వాళ్ళ సంస్థ గూర్చి సుదీర్ఘంగా వ్రాశారు. ఆమె ఇంటర్వ్యూ చేసిన సేవిక 'పూనం గుప్తా' అభిప్రాయంలో "మహిళా హక్కుల గూర్చిన భావన పాశ్చాత్య విష వృక్షానికి కాసిన



పండు లాంటిది. దాన్ని సహించకూడదు. అది పురుష కుటుంబ సభ్యులతో అనారోగ్య పోటీకి, కుటుంబ విచ్ఛిన్నానికి, పిల్లల నిరాదరణకు, అశాంతికి దారితీస్తుంది.” ‘ఆశా శర్మ’ అనే మరో సేవిక అభిప్రాయంలో “హక్కుల భావనే మానభంగాన్ని, గృహ అశాంతిని ప్రేరేపించేది. పురుష అణిచివేతకు అదే ఏకైక కారణం. భార్యలు భర్తలకు లొంగిపోయినట్లు, పిల్లలు తల్లిదండ్రులకు లొంగిపోవాలి. లేకపోతే ఆ స్పర్థలే గృహ విచ్ఛినానికి దారితీస్తాయి. వితంతువులు వారి పిల్లల క్షేమం కోసం పునర్వివాహం చేసుకోకూడదు. ఆర్థికపరమైన అత్యవసర పరిస్థితులలో తప్పించి మహిళలు ఉద్యోగాలు చేయకూడదు.”

*

# ఆదివాసీలు - హిందూత్వం

అర్చనాప్రసాద్

సంఘ్‌పరివార్ వారు తమ రాజకీయ లక్ష్యం అయిన హిందూ రాష్ట్రం సాధనకు ఆదివాసీలను హిందువులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్న విషయం అందరికీ తెలుసు. 'స్వగ్రహానికి' (ఘర్ వాపసీ) కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్ మత మార్పిడులను ప్రోత్సహించడం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అంతేగాక గిరిజనులుండే కొండ ప్రాంతాలన్నీ ఖనిజాలతో నిండి ఉన్న ప్రాంతాలు. కార్పొరేట్‌లకు ప్రత్యేకంగా కావలసిన ప్రాంతాలు. ప్రభుత్వ విధానాలకు నిత్యం అనుగుణంగా ఉండే సంఘపరివార్ ఈ ప్రాంతలలోని, వనరులను భూమిని గిరిజను అధీనం నుండి తీసుకునేందుకు ఆదివాసీలలో పనిచేయడం ప్రారంభించింది. ఈ రెండు అంశాలు కలిపి చూస్తే, మౌలికంగా సంఘపరివార్ గిరిజనుల ఎడల ఎలా ప్రవర్తిస్తుందో తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది.

1

## 'స్వగృహానికి' (ఘర్‌వాపసీ)

ఇండియా అంటే హిందూ రాష్ట్రమని హిందువులు తమ వారినందరినీ కూడగట్టుకోవాలన్న మోహన భగత్‌గారి ప్రకటన గిరిజనులపై ప్రత్యక్ష ప్రభావం చూపింది. 2006 లో గుజరాత్‌లో మోదీగారు మత మార్పిడులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టం గిరిజన సంస్కృతిని హిందు సంస్కృతిలో మమేకం చెయ్యడానికి

ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ చట్టంలో 'హిందూ' అనే పదానికి ఇచ్చే అర్థంలో నాస్తికులను, బౌద్ధులను, జైనులను కూడా కలిపారు. విస్తృతంగా చెప్పకోవాలంటే గిరిజను ప్రకృతి లోని అంశాలను ఎక్కువగా ఆరాధిస్తారు. మత మార్పిడులు గాని 'తిరిగి స్వగృహానికి' రావడం అనే కార్యక్రమాలు 1930ల నుండే సంఘపరివార్ వారు, మధ్య, తూర్పు భారతదేశంలోని గిరిజనులలో తమ ప్రాపకం పెంచుకునేందుకు ఎన్నుకున్న ఎత్తుగడ. ఇది దళితులు, గిరిజనులు మౌలికంగా హిందువులే అయినా మిషనరీలు 'బలవంతం'గా వారిని క్రిష్టియన్లుగా మార్చారన్న అనుమానంతో మొదలయింది. ఈ మిషనరీలు గిరిజనులకు చదువు చవకగా అందించడం, మందులు అందించడం లాంటి సంక్షేమ కార్యక్రమాలు చేసి వారిని తమవైపు 'ఆకట్టుకోవడం' జరిగింది. గమనించవలసిన ఇంకో విషయం ఏమంటే మిషనరీలు కరువు కాలంలో సహాయక చర్యలు చేసి గిరిజనులలోకి వెళ్ళగలిగారు.

వీటిని ఎదుర్కొనేందుకు పాలక వర్గాల సహకారంతో మితవాదులు ఆర్య ధర్మసేవక్ సంఘ్ వంటి సంఘాలను గిరిజనులలో సంక్షేమ కార్యక్రమాలు చేసేందుకు ప్రోత్సహించారు. ముఖ్యంగా జోషిపూర్ వంటి సంస్థానాలలో ఈ పని చురుకుగా సాగింది. జోషిపూర్ రాజుపై మతమార్పిడులు చేయరాదంటూ మిషనరీల పనిని అడ్డుకునే చట్టం తేవాలని కూడా వారు వత్తిడి చేసారు. 1940లకు మిషనరీ వ్యతిరేకత బలపడి గిరిజనులను హిందువులుగా మార్చే ప్రయత్నాలకు అడ్డు చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. హిందువులు గా మార్చే కార్యక్రమం నిరంతరంగా కొనసాగింది.

1940లో ఆర్య ధర్మసేవక్ సంఘ్ (హిందూ మహాసభ స్థాపించిన సంస్థ) మిషనరీ విద్యకు ప్రత్యామ్నాయంగా జాతీయ పాఠశాలలను స్థాపించి ప్రత్యామ్నాయ విద్యకు శ్రీకారం చుట్టింది. హిందూ మహాసభ ఆధ్వర్యంలో జరుగుతున్న మత మార్పిడులకు, స్వచ్ఛత సమకూర్చే మిషనరీల పద్ధతులకు వ్యతిరేకంగా పనిచేయడం, హిందువులలో మమేకమవ్వడమే లౌకిక భావనగా అర్థం చేసుకోవడం ప్రారంభమయింది. గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ముఖ్యంగా ఐదవ షెడ్యులు అమలయ్యే ప్రాంతాలలో మిషనరీ కార్యకలాపాలు జరుగకుండా అడ్డుకోవడంలో సఫలీకృతులయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మిషనరీ

కార్యకలాపాల మీద విచారణ మొదలయిన వెంటనే మిషనరీలు మీద దాడులకు కొత్తగా ప్రేరణ కూడా వచ్చింది.

ఈ కమిషన్, ఎన్.బి. నియోగి గారి ఆధ్వర్యంలో ఏర్పడింది. అయితే అందులో ఒకే ఒక క్రిష్టియన్ ఉన్నారు. ఆయనా గాంధేయవాదే. అందులో ఇంకెవ్వరూ మైనారిటీలకు ప్రాతినిధ్యం వహించేవారే లేరు. ఆ కమిటీ సిఫారసులలో ముఖ్యమైంది అన్నిరకాల విదేశీ, మిషనరీ సంస్థలను నిషేధించడం. దీనితో రాష్ట్రంలో మిషనరీ కార్యక్రమాలు పాక్షికంగా ఆగిపోయాయి. దేశం వాటి స్థానంలో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది.

కమిషన్ ఏ సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకుని సిఫారసులను చేసిందో చూస్తే మతమార్పిడిపై వారి అవగాహనే చాలా సార్లు వేరుగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఎక్కువసార్లు ఈ తేడాలు మార్పిడికి గురవుతున్నవారి ఆర్థిక, సామాజిక స్థాయిని బట్టి ఉండేవి. గోండులు యూరాన్స్ లాంటి పేద వ్యవసాయదారులైన గిరిజనులు హిందూమతంలోకి గాని క్రైస్తవ మతంలోకి గాని మారడం అంటే కొన్ని ప్రాధమిక ఆర్థిక అవసరాలను ఉచితంగా పొందడమే.

అయితే కమిషన్‌కు సాక్ష్యమిచ్చిన వారిలో అధికులు మధ్య ఆపై తరగతి సేవలందించే నిపుణులు. మిషనరీలు వలన వీరే ఎక్కువగా నష్టపోతున్నారు. వారే ఆ ప్రాంత భూస్వాములు. కాంగ్రెస్, కయినా 'మహాసభ'కయినా వీరే వెన్నెముకలాంటివారు. మిషనరీల కార్యకలాపాలను, కొన్నిచోట్ల తగ్గించి, మరికొన్ని చోట్ల నిషేధించాలన్న వారి డిమాండ్లకు హిందూత్వ ఎజెండాను అంతర్గతంగా కొమ్ముకాసింది.

**మార్పిడుల వాహకాలు**

గిరిజన ప్రాంతాలలో ఆర్ ఎస్ ఎస్ కి ప్రముఖ జాతీయ స్రవంతి పార్టీలలోని మితవాదుల కలయిక నియోగి కమిషన్ చర్చలలో తేటతెల్లమయింది. 1970లో వనవాసి కల్యాళ్ ఆశ్రమ్ లాంటి అనేక వేదికలు అతి త్వరితగతిన వ్యాప్తి చెందడం చూసాం. ఈ పెరుగుదల ముఖ్యంగా ఎమర్జన్సీ తరువాత, జనసంఘం

ఆవిర్భవించిన తరువాత మరింత వేగం పుంజుకుంది. 21వ శతాబ్ద ఆరంభం నాటికి, మనదేశాలలో ఎన్‌డిఏ అధికారం అందతో, వనవాసి కళ్యాణ్ ఆశ్రమాలు 8955 ప్రదేశాలలో, 312 జిల్లాలలో 1203 మంది పూర్తి కార్యకర్తల పర్యవేక్షణలో నడుస్తున్నాయి.

ఎస్.డి.ఎ ప్రభుత్వం హిందూత్వాన్ని అమలుచేస్తున్న ప్రభుత్వేతర సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలకు గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ; ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో గ్రాంట్లను జొప్పిస్తున్నది. మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలలో 85% నిధులు సంఘ్‌పరివార్ నిర్వహిస్తున్న ప్రభుత్వేతర సంస్థలకే తరలుతున్నాయి. గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ సామాజిక ప్రయోజనాలు స్కీములలో 17 ప్రభుత్వేతర సంస్థలలోని 13 సంస్థలు సంఘపరివార్‌కు అనుబంధ సంస్థలే. ఈ సంస్థలు, ఆశ్రమాలు గిరిజనులలో సామాజికంగా హిందూత్వాన్ని నింపేందుకు, గిరిజన తతంగాలను స్థానిక హిందూ సాంప్రదాయలతో మమేకం చేసేందుకు పనిచేస్తున్నాయి. చెప్పుకోదగ్గస్థాయిలో యువకులను ఈ 'స్వగృహానికి తిరిగివచ్చే' కార్యక్రమంలో నాయకత్వం వహించేటట్టు తయారు చేసారు. ఈ నేపథ్యంలో హిందూత్వ శక్తుల ఎదుగుదలకు అడవి ఆర్థిక వ్యవస్థకు పునాది అయిన, అడవిమీదే ఆధారపడి బతుకుతున్న గిరిజనుల సామాజిక సంబంధాలను ముసుగు తొలగించి చూడాల్సిన అవసరం ఉంది.

**కార్పొరేట్‌కు వ్యాపారులకు చేయూత :**

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, మండల్ తర్వాతి కాలంలో హిందూత్వాన్ని శక్తివంతంగా (స్వగృహనికి తిరిగి వచ్చే కార్యక్రమాల రూపంలో) అమలుచేస్తూ, కార్పొరేట్ పెట్టుబడులకు సహాయపడే విధానాలను ప్రారంభించారు. వారి విధానాలతో సింహభాగం వనవాసికళ్యాణ ఆశ్రమం, సరస్వతీ శిక్షా సంస్థాన్ (సంఘపరివార్ అనుబంధ విద్యా సంస్థలు) నిధుల సమకూర్చిన వ్యాపారులకు, పెద్ద కంపెనీలకూ, విదేశీ పెట్టుబడిదారులకు ఉపయోగపడేదే. కలకత్తాలోని మహేశ్వరీ వ్యాపార వేత్తల ఆధ్వర్యంలోని శిశుమందిర్ ట్రస్టు, దాని స్థానిక విభాగాలు వ్యాపారవేత్తలు, భూస్వాముల ప్రాపకంలో నడుస్తుండడం యాదృచ్ఛికం కాదు. అందువలన

సంఘ్‌పరివార్ కార్యకలాపాలు బ్రిటిష్‌వారు పాలించిన దగ్గరి నుండి గిరిజనులను దోపిడీ చేసే విధానాలకు భిన్నంగా లేవు. ఎన్.డి.ఎ విధానాలు ఆ పద్ధతులు బలపరిచేవిగానూ, లేదా సహాయపడేవిగానే ఉన్నాయి. బాల్‌కోలో ప్రభుత్వ పెట్టుబడి ఉపసంహరణ గాని, భూమి, నీరు, అటవీ వనరులు షిఓనాథ్ నది విషయంలో లాగా ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే విధానాలు గిరిజనులలో పేదరికాన్ని పెంచేందుకూ నిరుద్యోగాన్ని పెంచేందుకు దారి తీస్తున్నాయి. కీలక విభాగాలు నుండి రాజ్యం పెట్టుబడులు ఉపసంహరించుకోవడం వలన మౌలిక సదుపాయాలు కుంచించుకుపోయాయి. ఈ సందర్భంలో వనాలు, వనాలలోని వస్తువుల సేకరణ, వికేంద్రికరించడం వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు, బహుళ జాతి కంపెనీలకు ఉపయోగపడుతుంది. వారు గిరిజనుల వనరులను, జ్ఞానాన్ని, శ్రమశక్తిని వశపరుచుకుని వారి లాభాలను పెంచుకోవచ్చు.

మత మార్పిడులకు తిరిగి పాల్పడవచ్చునన్న వాదనలను ఈ కోణం నుంచి చూడాల్సి ఉంది. బి.జె.పి పాలిత రాష్ట్రాలయిన గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో భజరంగ్‌దళ్, విహెచ్‌పి హిందూమతంలోకి తిరిగి మారమని చేసే ప్రచారం, విహెచ్‌పి హిందూమతంలోకి తిరిగి మారమని చేసే ప్రచారం, మత మార్పిడులు చేయకూడదంటూ చట్టం చేయడమే కాక దానిని గట్టిగా గిరిజనప్రాంతాలు కాని చోట అమలుపరచడం సంఘ్‌పరివార్ సంస్థలకు ధైర్యాన్నిచ్చాయి. ప్రస్థుతం సంఘటనలను చూస్తే మళ్ళీ క్రిష్టియన్లపై ఈ సంస్థలన్నీ గురిపెట్టినట్టు కనిపిస్తున్నది. ఈరోజు గిరిజన ప్రాంతాలలో కార్పొరేట్ శక్తులు మరింతగా దోచుకునేందుకు సిద్ధపడుతున్న నేపథ్యంలో ఈ మత మార్పిడుల ప్రచారానికి వారి మద్దత్తు పెరిగే అవకాశం ఉంది. దీనిని తగిన ఆధారాలను ప్రజాతంత్రశక్తులు క్షేత్రస్థాయిలో నిరూపించగలిగితే మత మార్పిడుల అసలు రహస్యాన్ని బట్ట బయలుచేయగలం.

2

**గుజరాత్ నమూనాలోని కొన్ని ఉదాహరణలు :**

2001-2014 మధ్యకాలంలో నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ కాలంలోనే గుజరాత్‌లోని గిరిజనులు రాజ్యాంగం వారికిచ్చిన హక్కులు

కోల్పోయారు. వారి జీవితాలు ఛిద్రమయ్యాయి.

గుజరాత్ గిరిజనుల జనాభా 14.8 %. వారు దక్షిణ గుజరాత్‌లోని సూరత్, భారూఛ్, నర్మదా, డాన్స్, తావి, నద్‌సారీ, వాల్‌సద్ జిల్లాలలోనే కేంద్రీకరించి ఉన్నారు. ఇవి ఐదవషెడ్యూలులో ఉన్న ప్రాంతాలు. ఇక్కడ ఉండే గిరిజనుల సలహా మండలి ముఖ్యమంత్రి గారి అధీనంలోనే ఉంది. కాని ఈ మండలి సమావేశాలు జరిగిందేలేదు. ఇక పంచాయతీ (షెడ్యూలు ప్రాంత విస్తరణ) చట్టం కాగితాలకే పరిమితం. గుజరాత్ నమూనాలో పిఇఎస్ఏ చట్టం కేంద్రం యొక్క నమూనాను అమలు పరచడంలో మతలబులు చేసి, నీరుగార్చి అధికారాలను గ్రామసభకు కాక తాలుక్ పంఛ్ చేతిలో పెట్టింది. 'నియాగిరి' రకమయిన పరిస్థితులలో గిరిజనులు తమ గ్రామంలో తమకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకనే హక్కు గ్రామసభకుండదు. తాలుక్ పంఛ్‌కే ఉంటుంది. అనేక పర్యాయాలు గ్రామపంఛ్‌లలో గిరిజనులు ఉండడం లేదన్నది గుర్తించడం జరిగింది. ప్రభుత్వాలు ఎస్.టి. రిజర్వేషన్లును సర్పంచ్ ఎన్నికలలో సక్రమంగా అమలు చేయడం లేదు. దీని ప్రభావం గిరిజన ప్రాంతంలోని భూమిని సమీకరించే సమయంలో వనరులను నియంత్రించే సమయంలోనూ కనిపిస్తుంది.

కేంద్రం సహాయం అందించే గిరిజన సబ్‌ప్లాన్ స్కీములు అమలుపరిచే విషయంలోనూ రాజ్యాంగం కల్పించిన ఈ స్థానం నీరుగార్చడం కనిపిస్తుంది. ప్రణాళిక సంఘం నివేదిక కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రకారం 2008 నుంచి గుజరాత్ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులను ఉపయోగించుకోకపోకవడం జరిగింది. గిరిజన జనాభాప్రాతిపదికన చూసినా, (14.8%) ప్రభుత్వ కేటాయింపులే చాలా తక్కువగా ఉన్నాయి. 2008లో కేంద్రం ప్రకటించిన గిరిజన సబ్‌ప్లాన్స్ గుజరాత్ సరిపోదని గుజరాత్‌కు గిరిజన ప్రాంతానికి సరైన సబ్‌ప్లాన్ గుజరాత్ రూపొందించుకుంటుందని ప్రకటించింది. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోదీ 10 అంశాల వనబంధుకళ్యాణ్ యోజన అనే పథకాన్ని, ఇది పబ్లిక్ ప్రయివేటు భాగస్వామ్యం నమూనా, ప్రవేశపెట్టారు. అచ్చం నూతన ఆర్థిక విధానాల కనుగుణంగా, కేవలం కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో మాత్రమే సంపద సృష్టి

జరుగుతుందన్న పద్ధతిలో, ఆ ప్రయోజనాలనుగుణంగానే ప్రత్యేకంగానూ రూపొందించబడ్డాయి. ఎక్కువ ప్రాజెక్టులు కార్పొరేట్లతోగాని, ప్రయివేటు రంగం, భాగస్వామ్యంలో ఉన్న ప్రభుత్వేతర సంస్థలలో గాని విద్య, వ్యవసాయ విస్తరణ రంగాలకోసం పనిచేసే సంస్దలలో కలిసి పనిచేసేందుకే మొగ్గుచూపాయి.

**ప్రయివేటు భాగస్వామ్యానికి పెద్దపీట :**

ఇందుకు సంబంధించిన రెండు కార్యక్రమాలు ముఖ్యంగా చెప్పుకోవచ్చు. మొదటిది 2007లో మొన్‌సాంటో విత్తన పరిశ్రమకోసం 'ప్రాజెక్ట్ సన్‌షైన్' పేరుతో ప్రారంభించిన హైబ్రిడ్ మొక్కజొన్న విత్తన తయారీ 2010లో ప్రాజెక్ట్ సమీక్ష రిపోర్టులో తేలిందేమిటంటే మొన్‌సంటో ఏమేరకు సాంకేతిక విజ్ఞానం మోలిక అందిస్తున్నదో అంతవరకే గిరిజనులు లాభపడుతున్నారు. ఈ మోలిక అంశాలు ప్రభుత్వేతర సంఘాలు కొని గిరిజనులకు అమ్ముతున్నారు. జరిగిన సర్వేలో 50 శాతం గిరిజనులు అప్పుతెచ్చుకుని, వ్యవసాయానికి అవసరమైన మోలిక అంశాలు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతేగాక వ్యవసాయోత్పత్తి కొంతమేరకు కొన్నిచోట్ల పెరిగినా వ్యవసాయేతర ఆదాయాలు, పసువుల పెంపకం, కోళ్ళ పెంపకం వగైరాల వలన వచ్చే ఆదాయాలు తగ్గిపోయాయి. ప్రభుత్వ సమీక్షలోనే తేలిందేమిటంటే ఈ రకమయిన వ్యూహాల వలన గిరిజనులను దారిద్ర్యం నుండి విముక్తులను చేయలేమని తేలడం అతి ముఖ్యమైన విషయం. ఇంకా ఇది కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే కాంట్రాక్టు వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకే దోహదం చేస్తుంది. కార్పొరేట్లకే ఈ విధానాలు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయనడానికి రెండో ఉదాహరణ గిరిజనుల చదువు కోసం ఏర్పడిన విద్యా కార్యక్రమాలు. ఏకలవ్య నమూనా, గురుకుల పాఠశాలలు ఒక గుజరాత్‌లో మాత్రమే లేకపోయినప్పటికీ, గుజరాత్‌లోనే ఇవి ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో నిర్మించబడ్డాయి.

"ప్రస్తుతం నడుపుతున్న గురుకుల పాఠశాలలను కూడా వాటి పూర్తి ఖర్చులను చెల్లించి వాటి యాజమాన్యం నగరాలలో నైపుణ్యంతో పనిచేస్తున్న ప్రయివేటు సంస్థలకు అప్పచెప్పి సాంఘిక చైతన్యం గల ప్రయివేటు పరిశ్రమలను

| 2013-14(బడ్జెట్ అంచనా) | | | | 2013-14 (సవరించిన అంచనా) | | | 2014-15(బడ్జెట్ అంచనా) | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| రాష్ట్రం | ప్రణాళిక | నాన్ ప్రణాళిక | బడ్జెట్‌లో శాతం% | ప్లాన్ | నాన్ ప్రణాళిక | మొత్తం | ప్రణాళిక | నాన్ ప్రణాళిక | బడ్జెట్‌లో శాతం% |
| ఛత్తీస్‌ఘర్ | 2.62 | 1.86 | 2.19 | 2.71 | 1.80 | 2.21 | 0.73 | 0.25 | 0.53 |
| గుజరాత్ | 7.33 | 0.74 | 2.67 | 7.91 | 0.93 | 2.87 | 6.88 | 0.36 | 2.70 |
| మధ్యప్రదేశ్ | 10.87 | 0.86 | 4.03 | 11.43 | 0.89 | 4.25 | 7.94 | 0.84 | 3.50 |

ప్రోత్సహించి నూతన ఉన్నత ప్రమాణాలు గల బడులను ఐ.టి.డి.పి ప్రాంతాలలో ఏర్పాటుచేయాలనే లక్ష్యం. (ఐటిడిపి అంటు ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ డెవలప్‌మెంట్ పాలసీ)

ఇది ఒక ప్రభుత్వం వెనుకబడ్డ ప్రాంతంలో విద్యను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పే మోసపూరిత విధానం. ఇది తమ స్వార్ధం ఇమిడిన మహాత్మాగాంధీ గ్లోబల్ స్కూల్స్ ఫౌండేషన్ (సింగపూర్), జీ లెర్నింగ్ ఎడ్యుకేషన్ సొసైటీ వంటి ప్రయివేటు ప్రభుత్వేతర సంస్థలు, ట్రస్టులు విద్యారంగం జొరపడేందుకు, పెంచుకునేందుకు అవకాశం కల్పించడమే. మోడీగారి నియోజకవర్గంలోని మణినగర్‌లోని ఉత్తమ్ సేవా ట్రస్ట్ ఆర్.ఎస్.ఎస్‌కు అతి చేరువైన సంస్థ. ఈ సంస్థల ముఖ్య ఉద్దేశం చదువుకున్న, నైపుణ్యం గల శ్రామికులను పరిశ్రమకు అందించడమే. అందువలన ఐటిడిపి భాగస్వామ్యంలో ప్రయివేటు విద్యాసంస్థలు, నిజానికి ఐటిడిపి వారికి సబ్సిడీలు చెల్లించినట్టే, ప్రయివేటు వ్యక్తులకు కావల్సిన నైపుణ్యం గల పనివారిని అందించే పనిలో వున్నాయి.

గుజరాత్ నమూనా అంటే ప్రయివేటు పెట్టుబడిదారులకు గిరిజనుల వనరులను సామాజిక వ్యవస్థనూ తెరిచిపెట్టడం. అంటే సామాజికంగా హిందూత్వంకి తరతరాలుగా మద్దతిస్తున్న చిన్న పెద్ద వ్యాపారుల సేవ చేయడమే. వీరు గిరిజనులలోకి జొరబడి వారిలో కూడా కుల విభజనల బీజాలు నాటారు. 2002లో జరిగిన అల్లర్లలో గిరిజనులను సమీకరించడానికి డాంగ్స జిల్లా అంతా క్రిస్టియన్ మిషనరీలు వ్యాపిస్తున్నారంటూ పుకారు లేవతీశారు. నిజానికి డాంగ్సే జిల్లాలో 5%

మాత్రమే క్రిస్టియన్లు ఉన్నారు. ఈ ప్రచారం 2006 తరువాత మరింత ఊపందుకుంది. అంటే మోడీ సర్కారు మైనారిటీలకు వ్యతిరేకంగా ఒక విశాల సంఘటనను తయారు చేయడంలో శ్రద్ధ చూపి ప్రజల అభిప్రాయాలను ఒకవైపు మళ్ళించే ప్రయత్నం చేస్తున్నదని అర్థం అవుతున్నది.

కార్పొరేట్ పెట్టుబడులు, హిందూత్వ కలిసి కట్టుగా గుజరాత్ అభివృద్ధి నమూనాలో పనిచేస్తున్నాయని స్పష్టంగా ముక్తాయించుకోవచ్చు. ఈ ధోరణిని నిలవరించాలంటే రాజకీయంగాను, సైద్ధాంతికంగానూ ప్రజాతంత్ర ఉద్యమాలు, సంఘాలు వారి పోరాటాలను ఈ ప్రాంతంలో పెంచాల్సిన అవసరం ఉంది. అలా చేయడం వలన మాత్రమే హిందూత్వను, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎదిరించగల ప్రజాతంత్ర చైతన్యాన్ని గిరిజనులలో నింపగలం.

## ఢిల్లీలో గుజరాత్ నమూనా

గత నాలుగేండ్లలో కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, మిగిలిన వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం చేసే ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తున్నది. 2012-13లో ఈ తరగతులకు బడ్జెట్‌లో 3.06% కేటాయింపులు జరిగాయి. 2013-14లో ఇది 3.48%నికి పెరిగింది. ఇది యుపిఏ చివరి సంవత్సరం అయినందు వలన అణగారిన వర్గాల సంక్షేమానికి సహజంగానే ఎక్కువగా కేటాయింపులు జరిగాయి.

అయితే గత రెండేళ్ళుగా, అంటే మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమ పథకాలలో కేటాయింపులు బాగా తగ్గాయి. 2014-15లో ఈ కేటాయింపులు బడ్జెట్ 2.98% కాగా 2015-16లో ఇది 2.88%నికి పడిపోయింది. గిరిజనుల సబ్ ప్లాన్‌ను సంబంధించిన వాస్తవాలు ఇలా ఉన్నాయి. గిరిజనుల సబ్ ప్లాన్‌లో వారి జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో 8.8% కేటాయించవలసి ఉంది. కాని వారికి కేటాయించినది కేవలం 1.4% మాత్రమే. ప్రణాళిక వ్యయంలో 4.8% 2013-14లో కేటాయించారు. మోదీ గారి పాలనలో ఇది 2014-15లో 4.3% గాను 2015-16లో 4.2% గానూ ఉంది. మొత్తం ఖర్చులో గిరిజన సబ్ ప్లాన్ ఖర్చు 1.12% మాత్రమే ఉంది.

'సహకార ఫెడరలిజం' పేరుతో రాష్ట్రాలకు నిధులు బదలాయించడం వలన కేంద్రం తక్కువగా కేటాయింపులు చేసిందన్నది మోదీ సర్కార్ వాదన. కాని రాష్ట్ర ప్రభుత్వాల కేటాయింపులు, (ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలయిన గుజరాత్, ఛత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్)ను చూసినా, అవేమంత గొప్పగా లేవు.

ఈ క్రింది పట్టిక బిజెపి పాలిత రాష్ట్రాలు గిరిజనుల సంక్షేమం కోసం చేసే ఖర్చులను తెలియజేస్తున్నది.

ఈ పట్టిక షెడ్యూల్స్ తెగలు కోసం, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమం రాష్ట్రాలు పెట్టే ఖర్చు ఎలా తగ్గుతున్నదో చూపిస్తున్నది. ఇది బిజెపి చారిత్రకంగా ఏర్పడిన అసమానతలు తొలగించేందుకు పూనుకోవడంపై సందేహాలు కలిగిస్తున్నది. దీని ప్రభావం ముందు ముందు ఎలా ఉంటుందో చూస్తాం.

ఈ రాష్ట్రాలలో ఆర్ఎస్ఎస్ దుష్ట ప్రచారాలు చేసి గిరిజనుల తెగలలో చీలికలు తెచ్చి వారిని బలహీనపరిచింది. తద్వారా వారి భూమి, వనరులు, అడవి స్వాధీనం చేసుకునే విధానాలకు ఎదురొడ్డి నిలవలేని బలహీనులుగా గిరిజనులను తయారుచేసింది.

అందువలన గిరిజన తెగల జీవితాలు ఏమాత్రం బాగుపడాలన్నా వారు బిజేపి, ఆర్ఎస్ఎస్ చూపిస్తున్న కార్పొరేట్ అనుకూల 'అభివృద్ధి' నమూనాకు వ్యతిరేకంగా పోరాడవలసిందే.

*